# 'సమాసమి'

[కథ]

= శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు =

అప్పట్లో నామకాం చంద్రభవనం. చంద్రభవనం పదిపద్ధానుగుపేటల నగరం-పట్టుమని ఓ మహాబస్తీ కాదుకాని, దానికి పల్లెటూరి నజ్జు వొదిలిపోయిం దని తెగేసి చెప్పచ్చు. ఆనగరానికి చెందిన ఒక సంస్థకి-నరి!- ఎన్నికల కార్తి వచ్చింది.

"ఓటరు మహాభాగ్యులారా! ఓటు యుగపుణ్యజనులారా! ఒక మనవి, చిత్తగించండి! ఇదేమీ స్వంతంగురించిన బ్యాండు బాజా కాదు, స్వార్థంగురించిన సరాగనాటకం కాదు. కేవలయథార్థం! అందులోనూ కాసాగా సత్యం! ప్రాణం అంటే ఏమిటో ఇంకా ఫలానా అని తేలకపోతేంగనక, అది ఏశరీరంలో నివసించి ఉంటేం గనక, ప్రాణం యొక్క తూనిక ఒక స్థిరమూల్యం అనే సంగతి స్థిరపడింది. కాబట్టి ప్రాణులు సమం. అందులో మానవులు బహుసమం, తెగ సమం. దేవుడు తనొక్కడూ రొట్టి పుచ్చుగుని మానవులకి ముక్క యిస్తాడా? ఎక్కడేనా ఉంటుందా! 'నాతో సరిసమానంగా, నా ఒరవడినే, ప్రతీ మానవవ్యక్తినీ తయారుచెయించానర్రా' అని, దేవుడు వినేవాళ్లతో వేనోళ్ల గొంతిగ చించుకున్నాడు. అందువల్ల కూడా మానవులు సర్వసమం (వ.రా. స్త్రీలుకూడా మానవుల్లోనే జమ). ఇటువంటి మానవవ్యక్తుల్లో ధనాధికార జ్ఞానసౌందర్యాలను గురించిన హెచ్చుతగ్గులు అనేవి అల్పుల కల్పనాశిల్పం! అయితే, హెచ్చుతగ్గులు ఎందులోనూ లేవా అని తమరు అడగగల్రు. ఉన్నాయి, ఉండాలి! స్థితులూ, పదవులూ, అంతస్థులూ, అవస్థలూ- ఇటువంటి వాటిల్లో మాత్రమే ఉన్నాయి. పోనీ వీటిల్లోనే ఆయిరి, ఆహెచ్చుతగ్గులు ఎందుకండీ ఉండడం? అంటే, ఏవో హెచ్చుతగ్గులు ఉంటూంటే గాని లోకవ్యవహారానికి జరుగుబాటే ఉండక, సర్వమూ స్తంభించిపోయి సృష్టియావత్తూ వ్యర్థం అయిపోతుందని దేవుడికి చాలా భయం అన్న సంగతి నాబోట్లకి రూఢిగా తెలుసు. అందువల్ల యుగయుగాంతరాలవరకూ స్థితులు మొదలైన వాటిల్లో హెచ్చుతగ్గులు ఉండి తీరతాయి. ఇక, మానవులు గ్రహించవలసిం దేమిటంటే:—ఎవరో కొందరు - కొందరుమాత్రమే లేచి, తగుదుమమ్మా అని చెప్పి, ఆస్థితుల్నీ పదవుల్నీ అధిష్ఠించి మైలురాళ్లులాగ పాతుకుపోయి బైఠాయించి తిష్ఠవెయ్యడం అప్రతిష్ఠ, అక్రమం, అమానుషం, అదైవికం!— అని. అల్లా జరగడం చాలా శోచనీయం ఏమనుకున్నారోగాని! అటువంటి చోట్లకి చకచకా ఎక్కగలుగుతూండేవాళ్లు వెంట వెం

టనే భిడియపడి, త్వరత్వరగా తప్పగుని, నరసరా దిగిపోయి, గబగబా వీలైనంతవరకు తండతండాలుగా ఇతరుల్ని బొట్టెట్టి పిల్చి, విడివిడిగా వాళ్లందరికీకూడా ఓ 'ఛాన్సు'— చమ్కీఛాన్సు కాకపోతే పీడాపోయిరి, పోనీ ఓ కుర్చీఛాన్సు, ఓ పంకాఛాన్సు, ఆఖరికి ఓ సంతకంఛాన్సు — ఇస్తూండడం ఎంత సమంజసం! పైచెప్పిన స్థితులూ పదవులూ ఒకవేళ కర్మవశంచేత అష్టకష్టాలూ పడి ఆక్రమించుకోగలిగిన వ్యక్తులు, తమబోటి తమలాటి తమసాటి తోటిమానవవ్యక్తులు కోట్లాదిగా వాట్లకోసమే పడగాపులు పడిఉంటా రనే గమనింపు ఎంత మాత్రమూ లేక, ఒక్కొక్క పదవికే ఒక్కొక్కడు ఏదో అక్కడికి పెద్ద పుస్తె కట్టిన ముగుడులాగ (—అసలు కొన్ని దేశాల్లో ఇప్పుడు ఏడాదిపుస్తెలూ, రెండేళ్ల పుస్తెలూకూడా తయా రవుతున్నాయిట!) నిరంతరంగా అవిచ్ఛిన్నంగా లంగరువేసె య్యడం ఉందే, అది, సంఘతిరోగమనానికీ, ప్రపంచమరణానికీ, లోకాస్తమయానికీ కారణ మవుతుంది ఏమనుకున్నారోగాని! కాబట్టి, పదవు లధిష్ఠించిన వ్యక్తులు కొండొకచో మానవశ్రేయస్సును గురించి ఆలోచన చెయ్యాని అటువంటిబాపతు అయినప్పుడు, తక్కినవాళ్లకేనా లోకశ్రేయోభిలాష ఉండద్దూ! వాగి పదవిలోకి వెళ్లినవాణ్ణి ఇంకా వాగేవా డొచ్చి దింపచ్చుగా! పాడుపన్లు చేసి పదవిపట్టినవాడికి పాడున్నరపన్లవాడు ఉద్వాసన చెప్పచ్చుగా! పోనీ, వేతన పదవులను గురించిన యాతన పై అధికార్లు పడతారు, గౌరవపదవుల గురించేనా జనం కట్టుదిట్టాలు చేసుగోవద్దూ! పాతవాడే అర్హుడూ, పాతసరుకే గట్టిదీ, పాతదినుసే మేలూ అంటూ కొందరు వోటేశ్వరులు వాదించడం అనేది చాలా కూపస్థంగానూ, మిక్కిలి దేశారిష్టంగానూ పరిణమించితీరుతుంది. అందువల్ల నే చెప్పేది, అధమం గౌరవపదవుల్లోనేనా వోటాధిపతులు పాత పైత్య విశేష వాదనలు కట్టిపెట్టి, కళ్లు తెరిచి, దృష్టి నిగిడించి, హృదయవైశాల్యం పెంచి, మానవ సమత్వం గమనించి, బొడ్డున మాణిక్యం పెట్టుగుని పదవినిమిత్తం కొందరే పుడతారు గావును అనే మూఢవిశ్వాసాన్ని నిరసించి, రంగు పిరాయించి, మార్పే పరమావధిగా పెట్టుగుని, క్షణక్షణమూ కొత్తవ్యక్తుల్ని నెల కొల్పుతూండడమే నవనాగరికత, నవజ్ఞానం, నవజీవనం! ఓటయేది, మరోటయేది-ఊహూ-పట్టిగెల్లి ఆ వెనకటి ఘటానికే సంక్రమింప జేస్తూకూచోడం ఎంత తప్పో గ్రహించుకోండి. జీవిస్తే మారలిగనక, మారిస్తేగాని జీవం కణకణలాడదు. పాత పాతే, కొత్త కొత్తే ఏమనుకున్నారో! కొత్త వ్యక్తిలోనే ఉంది ఏమున్నా! కొత్త పంథా అంటేనే సొగసూ! అబ్బ! కొత్తావకాయరంజు పుర్రె పోతే మరోదానికి ఉంటుందిటండీ చాదస్తం గానీ! అయ్యో! కావున, ప్రతీస్థితికీ ఎప్పుడూ పాతవాడేనా! ప్రతీపదవికీ కలకాలమూ పూర్వవ్యక్తేనా! ప్రతీఅంతస్థుకీ ఎల్లకాలమూ ఆఘుటమేనా! ప్రతీ అవస్థకీ అస్తమానమూ ఆస్వరూపమేనా! కాదు, కాదు! ప్రతీదాల్లోనూ ప్రతీకొత్తవాడికీ తరుణం రావాలి! ప్రతీవాడూ చలామణీకావాలి! అంతా మారాలి:—ఇట్లు, సమానమిా."

అనే సారాంశం గల పదాలతో చంద్రభవన వారపత్రికల్లో ఒకటైన 'యుగ

సంధి' పత్రికలో 'సమానమీ'గారు ప్రకటించిన వ్యాసం ఊర్ని ఇల్లా ఊపేసింది. ఎక్కడ ఎవరు మాట్టాడినా దీన్ని గురించే. ఎవరు ప్రమాణించినా ఇందులోంచే. ఈ వ్యాసంతో ఊళ్లో ఉండగల దళసరిజనంలో కూడా సంచలనం కలిగింది, గడ్డ తిరగపడింది, కట్ట తెగడింది. కొత్తదనం ప్రతీ జీవుడిదగ్గిరా ఉండడంవల్ల ప్రతీవాడూ ఈ రచన తన్నే ఆహ్వానిస్తోం దనుకుని, ప్రతీ ఇతరుడి దగ్గిరా పాతదనం కనిపెడుతోచ్చాడు. దీని అర్థం కొంతవరకే అని చాలామం దన్నారు. దీని భావం చాలాదూరం వెడుతోం దని కనుబొమ లెత్తారు వెయ్యికి ఒకరిద్దరు. ఎం జేస్తాం, అది సత్యంగనక భరించవలసిందే అని ఒకరకంపెద్దలు పెదిమివిరిచి చప్పరించారు. తమకి ఏది చిక్కగా ఉంటుందో అదిమాత్రం అందులో లేదంటూ కొందరు అర్థవాదులు, భావవాదులు, తాత్పర్యవాదులు, వ్యాప్తివాదులు ఇల్లాగ్గా ఊళ్లో వెలిశారు. పోటీలు, పట్టింపులు, పందెంవేసు గోడాలు, ఉక్కురోషాలు, ఉడుకుమోత్తనాలు, అకారణ వైరాలు-ఇల్లాంటివి కూడా ఈరచనవల్ల బయల్దేరాయి.

ఓట్ల కట్నాలు చదివించే రోజు వస్తోం దనగా, ఒకనాడు నేను షికారువెళ్ల డానికి బయల్దేరాను.కొన్ని వీథులు దాటి అమాంత రావు ఇంటిఎదటికి వెళ్లేసరికి, ఆయింటి మెట్లు ఉత్సాహంగా దిగుతూ, చేతులో ఉన్న పత్రిక మడిచి జేబులో పెట్టుగుంటూ, మొహంలో కులాసా కనపరుస్తూ సవారినాథం వస్తున్నాడు. సవారినాథం ఊళ్లో పెద్ద హడావిడిదాసూ, చిన్న గ్రంథసాంగుడూ, కొంచెం నాయకుడూ, ప్రతీవిషయంలోనూ తప్పనిసరి పెత్తందారూనూ! విశేషించి నాకు ఓ వేలువిడిచిన పరిచయుడూనూ!

స—ఇదుగో! (అని నన్ను చూసి కనుబొమ్మలూ, దవడలూ ఎగరేశాడు.)

నేను—(తల ఎగరేసి నవ్వాను)

స—ఊళ్లో లేరామిటి, ఈమధ్య కనపట్టం లేదు!

నే—అబ్బే, ఉన్నా! అమాంతరావు గారింట్లోంచి వస్తున్నారే!

స—అవును, ఆశ్చర్యంగా ఉందా?

నే—మీకూ మీకూ వెనక మాటలు పోయిన ట్టున్నాయి?

స—ఆఁ. ఎక్కడికి పోతాయీ, మళ్లీ వచ్చేశాయి! అవసరంవెంబడిని వస్తూంటాయి.

నే—పోనీలెండి, అదే కావలిసింది. నాకు సెలవు. వెళ్లొస్తా.

స—ఉండవయ్యా, ఏకతొందర! నేను పొద్దుణ్ణించి ఎన్ని మైళ్లు తిరిగానో తెలుసా?

నే—ఓట్లకోసంకాబోలు!

స—కాకపోతే దేనికీ! తెల్లారకట్ట లేచాను, కాఫీ పీల్చాను. రెండుఊళ్లెళ్లివచ్చి ఈఊళ్లో, ఇంకా ఇంటికేనా వెళ్లకుండా, తిరుగుతూనే ఉన్నాను. ఇంతవరకు మెతుకులు లేవు.

నే—అరెరె. వెళ్లి ఎంగిలిపడండి పాపం.

స—అక్కర్లేదు. నిమ్మణంగా వెడదాం. వెళ్లిన పని అవుతూంటే శ్రమ కనిపించదు. రెండుగంటలు కూచుంటేగాని ఓ ఆసామీ ఓటు చేతులో పడలేదు. ఒకప్పుడు అల్లా వస్తూంటుంది.

నే—అమాంతరావు ఓటా ?

స—కాదు, సజ్జనరావుది.

నే—అతడు పేచీపెట్టడే! వెళ్లగానే పువ్వుల్లో పెట్టినట్టు ఓటు మూటకట్టి ఇచ్చేస్తాడుగా మొదట అడిగినవాడికీ!

స—అబ్బో, అది వెనక.

నే—అయితే ఏం జేశారూ ?

స—ఏముందీ? సజ్జనరావుకూతురుకి పెళ్లిసంబంధం కుదరటం లేదు. ఓ ఎక్కా సంబంధం రైటుచేస్తా నని అతనికి నచ్చచెప్పి అతని ఓటు లాగేశాను.

నే—వరుణ్ణి ఎల్లా సృష్టిచేస్తారండీ, ఊహాచిత్రమా ఏమిటి ?

స—కాదు. నాస్నేహితు డొక డున్నాడు పట్నంలో. అతడి భార్యదగ్గిర లోపాయికారీఅనుమతి మొదట పొంది, ఆవిడికి పబ్లీగ్గా విడాకు లిప్పించి, పెళ్లిఅవసరం అతడికి కలిగించి, ఈసంబంధంలో వచ్చే కట్నం ఆవిడికి పారెయిస్తాను! దానికేం గాని, అమాంతరావుని పడగొట్టడం మరీ కష్టం అయిందిస్మీ!

నే—అదెల్లా సాధించారు ?

స—(పత్రిక పైకి తీసి) ఈ 'యుగసంధి' సంచికలో ఎవడో మహనీయుడు 'సమానమీ' అనే మారుపేరుతో రాసిన రచనధర్మమా అని, అతణ్ణి బుట్టలో వేశాను. "గట్టివాడైతేమాత్రం, అస్తమానం ఆ ఒకడేనా గౌరవపదవిలో ఉండడం ? మాటవరసకి చెబుతాను: రేపు మీరోమరీ, మీవాడోమరీ, తక్కినవాళ్లోమరీ, చెబితే బడాయనుకుంటారు, ఎంత చెడ్డా, నేనోమరీ!" అంటూ మాలీసు చేసేసరికి, ఓటు నా కిచ్చేస్తానన్నాడు.

నే—అయితే, విజయం మీదే అన్నమాట!

స—అన్నమాట!

అంటూ మాట్లాడుకుంటూ ఆవీథి నడిచి ఓమలుపు తిరగ్గానే, వెనకాల్నించి పరిగెట్టుకుంటూ, మీనయ్య చక్కా వచ్చాడు. మీనయ్య సవారినాథంగారి రెండోవాడు. అతగానికి మైనారిటీబాధా,స్కూలుఫైనలుపీడా-రెండూ కూడా ఏకకాలమందే వొదిలిపోయాయి.

మీ—లెఖ్ఖ కట్టించావా, నాన్నా!

స—అబ్బ, ఇప్పుడేమిటోయ్! ఇక్కడే నామిటీ!

మీ—అవును. చాలా అర్జెంటు.

నేను—నాకు సెలవా? ఏదో రహస్యమేమో!

స—దిబ్బ రహస్యం! తన వాటా పంచిపెట్ట మంటాడు.

మీ — అందులో తప్పేముందీ? ఆ అబ్బాయినికూడా రమ్మన్నాను.

స—ఆ అబ్బాయేమిటీ?

మీ—ఒక మంచి కుర్రాడు. నా వాటా నాకు దఖలుపడగానే అతనికి ఇచ్చేస్తాను.

స—(నాతో) చూశారా, మావాడి దాతృత్వం!

నే—ఎవరి పుత్రుడు మరీ! (మీనయ్యతో) ఇచ్చేసి మరి నువ్వేం జేస్తావు బాబూ!

స—ఎం జేస్తాడూ! చెంబుకి చింతపం డట్టిస్తాడు.

మి—అదేమిటి నాన్నా! అల్లా కొప్పడతారేం? కర్మాగారంలో పనిచేస్తాను. ఇంకోళ్లకి లేనప్పుడు నేనుమట్టుకి అనుభవించనా ?

స—ఏడిసినట్టే ఉంది ఆఖరికి !

మి—. అయితే నేను ఉండకుండా అసలు పోతాను. సరిగ్గా చెప్పండి ఇచ్చేదీ లేందీ! ఇస్తారా, ఆ అబ్బాయి కిచ్చేస్తాను. అతనేమిమ్మల్ని 'నాన్నా' అంటాడు. ఎప్పుడూ నేనేనా? ఆ అబ్బాయి గనక రాకపోయినా, ఇష్టపడకపోయినా నా వాటా ఈఊళ్లో జనాని కంసరికీ సమానంగా పంచిపెట్టేస్తాను.

స—కొందరికొందరికి అఖ్ఖర్లేదోయ్, నీ బోడివాటా!

మి—అయినా పంచుతాను.

స—ఏమొస్తుంది, నీమొహం, ఒక్కక్కళ్లకీ! నీవాటా నాలుగువే లుంటే ఏమయినట్టూ, ఈఊరి జనాభాకీ!

నే—ఒక అరకప్పుకాఫీ విలవ రావచ్చు ఒక్కొక్కడికి.

స—బాగా చెప్పారు. అబ్బాయి, నడమ్మా! నిదానించు. అల్లానే పంచుతాన్లే.

అంటూ మాట్లాడుతూ మరోవీధి నడిచి మరోమళుపు తిరగగానే సవారినాథంగారి ఇంటి వీథులోకి వచ్చాం.

మి—నాకు మీటింగు ఉంది, నే పోతాను. నావాటావిలవకి చిల్లర పట్రండి.

స—అదోటా!...పోనీ అన్నానికొస్తావా!

మి—రాత్రి మాకు మరో మీటింగు లేకపోతే వస్తాను.

స—సరే.

మీనయ్య వెళ్లిపోయాడు. మేం నడుచుగుంటూ సవారినాథంగారి ఇంటి ఎదటికొచ్చాం. ఓ జట్కాలోంచి మువ్వ దిగుతోంది. మువ్వ సవారినాథంగారి పెద్ద కూతురు. ఆ అమ్మాయి ముక్కుమీద కట్టు కట్టుగుని ఉంది. మరొక అమ్మాయి బండిలో ఉంది. ఆ అమ్మాయినికూడా దిగమని సంజ్ఞ చేసి, మువ్వ దింపింది.

స—(మువ్వమొహంకేసి ఆశ్చర్యంగా చూసి) అదేమిటమ్మా!

ము—(మాట్లాడకుండా కొత్త పిల్లకేసి చూపెట్టింది.)

స—(కొత్తపిల్లతో) నువ్వు కొట్టావా ఏమిటమ్మా మా అమ్మాయినీ?

కొ—అంత పసువునాండీ!

స—మా అమ్మాయి మాట్లాడదేం మరీ?

కొ—అసలు నేను వద్దంటూనే ఉన్నానండి.

స—ఏం జేసిం దేం జేసింది?

కొ—తన ముక్కుచివర చిన్న ముక్కోటి కత్తిరించి దూరంగా పారేశింది, వెతికి తెచ్చి అతగడానికేనా వీల్లేకుండా!

స—అయ్యో! అదేమీ?

కొ—మొదట మేం ఇద్దరమే వాదించుగున్నాం అనుకోండీ! తరవాత వెళ్లి మధ్యవర్తుల్ని అడిగాం.

స—ఏవిషయం?

కొ—మా యిద్దర్లో అందకత్తె ఎవరూ అని! ఎవర్నడిగి చూసినా, మీ అమ్మాయే అందమైం దన్నారు.

స—లేకపోతే ని న్నంటారని ఎల్లా అనుకున్నావ్, పిడకమొహం తల్లీ! నువ్వే మన్నావ్?

కొ—చెప్పేదోటీ, చేసేది మరోటీనా అన్నాను.

స—అనగా?

కొ—రూపం ఎప్పుడూ తనకే ఉంచుగుంటే, సమత్వంకబుర్లు కట్టెయ్య మన్నాను.

స—ఏడిసినట్టే అన్నావు తల్లీ! ఇంకోరి రూపం నీ కెల్లా వస్తుంది ఎడ్డిమ్మొగానికీ! నీమాటలో నబబుండాలా?

ము—అందుకనే నే నీపని చేశాను నాన్నా! నారూపానికి వికారం వచ్చేసింది గనక ఈవిడరూపానికి అందం బయుద్దేరేసింది. ఇంట్లోకి పదండి. (ఆవిడతో) రావమ్మా, రాంభాయమ్మా! కాఫీ పుచ్చుగుని వెడుదుగాని!

స—(నాతో) ఎంత చిత్రంగా తయారయారో చూశారా! సంతానాల్ని కన్నవాళ్లని ముక్కూ చెవులూ తెగ్గోయ్యాలి.

నే—నాసికాగ్రత్యాగం సంతానాలే చేస్తూంటే, తల్లిదండ్రులకి కర్ణఖండన చాలనుకుంటాను. 'సమాసమా'గారు ఈవిషయంలో ఏమంటారో!

స—ఏమో! వారి మొహం అంటారు, వారి మొహం వారే మోరానూ!

అని సవారినాథంగారు పత్రిక తీసి, చింపి, ముక్కలుచేసి నారచల్లినట్టు చల్లేశారు. వీధిగేటు దాటి ఇంటి ఆవరణలో మొక్కలమధ్య తీర్చి కట్టిఉన్న 'ఆర్చి' కింది బాటమీద నాలుగడుగులు వేశాం.

నే—నాకు సెలవా?

స—అబ్బ, రస్తురూ! కాస్సేపు కూచుని వెడుదురుగాని!

అనడం ముగియకుండానే, భంట్రోతు ఎదటిహాల్లోంచి పైకివచ్చి,

భం—అయ్యగారండి! పెద్దబ్బాయిగారికి ఆప్రేషన్ అయిందండి. ఆర్నీ, ఆ ఇంకో అబ్బాయినీ ఇప్పుడే ఉత్తరపుగదిలో పడుకోపెట్టి ఎల్లిపోయారండి, డాక్టరు!

స—(ఖంగారుగా) అయ్యో! ఆపరేషనా?

భం—మరేనండి.

స—ఇంకో అబ్బాయా?

భం—మరేనండి. మరో అబ్బాయి!

స—బాఘా దెబ్బలు తగిలాయా ఇద్దరికీ? సైకిల్ సరసంగావును.

భం—కాదండి.

స—మరి!

నే—శంఖయ్యకాదూ మీపెద్దబ్బాయి?

స—అవునండి.

నే—ఏమన్నా జబ్బుగా ఉందా?

స—లేదండీ! పట్నంనించి సెలవలకి వచ్చాడు వారమాయె. (భంట్రోతుతో) కొట్టుగున్నారా ఏమిట్రా, కర్ర ఉచ్చుగునీ! ఎదీ! ఆగదులోకి వెడదాం నడు.

భం—రేపు ఉదయందాకా ఆర్ని మాట్టాడించకూడదంటండి, డాకటేరు అన్నారు.

స—హారీ! అల్లాయితే అసలు ఆప రేష నేమిట్రా, దిక్కుమాలాడా!

భం—అబ్బ, ఏటండీ, నన్నంటారూ! బుర్రకాయ ఆప్రేషనా, బుర్రగుంజో, అదే దోటండి! ఎల్లి డాక్టర్ని తీసుగొచ్చేదా! ఆరు కొత్తోర్ట.

స — అబ్బ, వా డెక్కడున్నాడో ఇప్పుడూ! అబ్బాయి కులాసాగా ఉన్నాడా, పోనీ?

భం—నవ్వుతూ ఉన్నారండీ.

స—స్పృహ ఉందా?

భం—అబ్బే, చా, పిక్కలా గున్నా రండీ.

స—(నాతో) వీడెవడో అఖండ డాక్ట ర్లా ఉన్నాడండోయ్!

నే—లేక ఒకవేళ, ఖండ డాక్టరేమో నండి.

స—ఏంరా? ఇంకా ఏం జేశాడు ఆడాక్టరు?

భం—అబ్బ, నాకు తెల్దండి. ఈరి బుర్రలో ఉండే గదుల మద్దిన కొలపుల్లతో సూత్తే తొంబయి పెగ్గె లున్నాయంటండి. మర్గో అబ్బాయికి పదే ఉన్నాయంట. ఈ అన్నాయం తీసెయ్యాలని పెద్దబ్బాయిగారి పట్టంట! మొంట్నే యీ ఆప్రేషనయింది. అబ్బాయిగారి బుర్రలోకి కపాళంపక్కమ్మటే బెమ్మరంధ్రంలో పిచ్చిగారి పోనిచ్చి ఓ నల భైపెగ్గెలు పైకి ఎగజుర్రి లాగేశారంట, ఆ సేత్తోనే ఆ ఇంకో అబ్బాయి బుర్రలోకి, అయి, 'ఇండీషర్' చేశారంట! రేపటుదయానికి ఇద్దరికీ ఓటే తెలివియా, ఓటే పెగ్గా, ఓటే మాటా, ఓటే గ్యాపకం, ఓటే అబిప్పరా యం, ఆఁ, ఓటే కమామీషూ ఉంటా యంట! వారం ఆగి మరో ఆప్రేషన్ చేత్తే, ఆ యింకో అబ్బాయికే తొంబయి పెగ్గెలూ, మన పెద్దబ్బాయిగారికి పదీ అయిపోతా యంట! (గారాం నటిస్తూ) అయ్యగారండీ! మీపెగ్గెలు నాకు 'ఇండీషర్' చెయించరండీ, మల్లీ ఆడాకటేరు తోకముడుత్తాడేమో!

స—(నిర్ఘాంతపోయి, నాకేసి చూసి) చూశారా, వీడి కోరికలు!

నే—(యాదాలాభంగా, భంట్రోతుకేసి చూసి) వాడు కోరుకోతగ్గవాడు, మీరు చెల్లించతగ్గవారు.

అని నే నూరుకున్నాను. నేను పోతా నంటే నన్ను సవారినాథం పోనిచ్చాడు కాడు. ఇంకా ఏం జరుగుతుందో అని నాకు భయం పట్టుగుంది.

స—(భంట్రోతుతో) సమాజంనించి అమ్మగా రొచ్చార్రా?

భం—రాలేదండి.

స—ఏమో?

భం—ఆడోరి కందరికీ ఈయాల సంబ రందినంటండి, సాలు సంబరంకామోసు.

స—అమ్మాయి, ముద్వా! రవ్వ రాలేదూ?

రవ్వ సవారినాథంగారి రెండో కూతురు.

ము—వాళ్ల నవసమాజభవనం ఈవేళ తెరుస్తారు. (పొట్టిగా ఉన్న వీధిగోడమీదించి చూసి) అదుగో, అక్కడికి ఈదార్నే వెళ తారుగావును!

ఒక్క చిటిగెలో మేం నడిచివచ్చిన వీధిచివరనించే ఆరుగురు క్రాపుజుట్టువాళ్లు,

ఇద్దరిద్దరు చొప్పున మూడువరసల్లో నడిచి వస్తూ మాకు కనిపించారు. మొదటివరసలో ఉన్న రవ్వ, చేత్తో, ఒక పటంకర్ర నిటాగ్గాపైకి పట్టుగుంది. ఆపటంమీద పెద్ద అక్షరాలతో "మానవప్రకృతిసమాజం— చంద్రభవనం" అని రాసిఉంది. కాక, ఆ అట్టమీదే రెండు బొమ్మలున్నాయి. రెండు బొమ్మలూ ఒకే వ్యక్తివి. కాని, ఒక బొమ్మ స్త్రీగానూ, ఇంకోటి పురుషుడుగానూ ఆవ్యక్తిని ద్యోతకం చేస్తున్నాయి. రెండు బొమ్మల్లోనూ ఉన్న వ్యక్తిముఖానికీ, ఆ అట్టకర్ర పట్టుగున్న రవ్వ యొక్క ముఖానికీ తేడా ఒక్క రవ్వకూడా లేదు.

స—(నాతో) మా రవ్వకి ఇదో చాదస్తం అండి.

నే—చాదస్తమేమండీ! నిక్షేపంలాఉంది.

స—రవ్వ ఎప్పుడూ నాతో వాదన-పరమాత్మ తనికిమల్లేనే ఉండి ఉండాలని.

నే— అల్లాగే మరీ! మరి నాకు సెలవా?

స—మా ఆవిడ వచ్చేవేళ కావొచ్చింది, ఉండండి.

నే—మీకు బోలెడు పని ఉన్నట్టుంది. ఇంకా భోజనం లేదాయిరి!

స—ఫరవాలేదు లేస్తురూ!

అని, ఆయన లోపలికెడదాం అని చూస్తూండగానే, ఆవీధి రెండోవేపునించి ఒక పెద్ద తొరతొక్కిడిలాగ స్త్రీజనం వచ్చేస్తున్నారు. కోలాహలం ముందే వస్తోంది. పెద్ద జండా పుచ్చుగుని ఎదట నడిచి సమీపిస్తున్నారు నాయకురాలైన చీమమ్మగారు-అనగా సవారినాథం సతి. తక్కినవాళ్లంతా, వెనకాల, ఎడంచేత్తో చిన్నజండా, కుడిచేత్తో పూలదండా పట్టుగుని ఘోషణఅరుపులు అరుస్తూ బిలబిలలాడుతూ, ఒకర్ని ఒకరు తోసుగుంటూ, దిగలాగుతూ, కదల్తున్నారు. పెద్దజండామీద "ఎల్లకాలం పాతవాడేనా!", "కలకాలం పూర్వఘటమేనా!"లాంటి ఎన్నికరోకళ్లపాటల చరణాలు రాసిఉన్నాయి.

స—(గీసిన కందలా మొహంచేసుగుని నాతో) చూశారా! దాని అర్థం ఏమిటో గమనించారా?

నే—ఎన్నికలండీ!అదోటుగా విషయం!

స—మీ తలకాయి. నాకు దానర్థం స్పష్టంగా తగుల్తూంటే పెడర్థం సమర్థిస్తావేమిటయ్యా?

నే—చిత్తం. ఇంతటితో నాకు సెలవా?

వచ్చేవాళ్లు ఇంకా సమీపించారు. చీమమ్మగారు ప్రశ్నకేకా, తక్కినవారంతా కలిసి జబాబుకేకా వేస్తున్నారు. (ఆవిడ చేసిన ప్రారంభమే ఇటీవల టాకీ ప్రదర్శనం గురించిన ఘోషణల్లో ఈ రాళ్లు నేర్చుగున్నట్టు తెలుస్తుంది!)

చీ—ఏం రకం కావాలీ?

తక్కిన—కొత్తరకం కావాలీ.

చీ—ఏం సరుకు పోవాలీ?

త—ఉన్నసరుకు పోవాలీ.

చీ—ఎక్కడెక్కడ పోవాలీ?

త—ఇంటా బైటా పోవాలి.

సవారినాథంగారు కూదోపడ్డాడు.

చీ—ఏంకూడా మారాలీ?

త—అంతాకూడా మారాలి.

చీ—ఏం పత్రిక చదవాలీ?

త—యుగసంధే చదవాలి.

సవారినాథం తల వెనక్కీ, కళ్లు పైకీ, కిందిదవడ కిందికీ పోయాయి.

చీ—ఏం వ్యాసం?

త—సమాసమీ.


చీ—ఎవరి వ్యాసం?

త—సమాసమీ.

తక్షణం ఆ స్త్రీలోకం యావత్తూ "జయ్ 'సమాసమీ' గారికీ జయ్!" అంటూ అరుస్తూ, ఒక్కొక్కరే వచ్చి తమ చేతుల్లో ఉన్న దండల్తో నాయకురాలి మెడ నింపేశారు!

---

ఆంధ్రుల మానసికోత్సవములు—పొగచుట్టల పంచమి




[బేట్మన్ గారి రచనావిధానము]